# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 13 సెప్టెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 62

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

ప్రజల కోసం అవసరమైతే రాజీనామా చేస్తా



2లో

విద్యుత్తు కొనుగోలుకు

## అనుమతించండి

ఇండియన్ ఎనర్జీ ఎక్ఛేంజికి హైకోర్టు ఆదేశం

తెలంగాణ డిస్కంలను కరెంటు క్రయవిక్రయాలకు అనుమతించవద్దన్న పవర్ గ్రిడ్ లేఖను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు

మెడికల్ అడ్మిషన్లలో స్థానికత

## వ్యవహారం

హైకోర్టు తీర్పుపై సుప్రీంలో ప్రభుత్వం పిటిషన్



2లో

# ఎర్ర చుక్క "ఏచూరి"కి జోహార్లు.



## కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి కన్నుమూత.

ఊపిరితిత్తుల సమస్యతో ఎయిమ్స్ లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు.

విద్యార్థి నాయకుడి నుండి జాతీయ మార్క్సిస్టు నేతగా ఎదిగాడు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.

సిఎం రేవంత్ రెడ్డి తో సహా, రాజకీయ నాయకుల వెల్లడి.

**వేగుచుక్క న్యూస్:**

ప్రముఖ రాజకీయవేత్త, భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. శ్వాసకోస, ఇతర ఆరోగ్య సమస్యలతో ఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) లో ఆయన చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు.
ఊపిరితిత్తులకు సంబంధించిన ఇన్ఫెక్షన్‌తో ఏచూరి ఆగస్టు 19న ఎయిమ్స్‌లో చేరారు. ఏచూరి సర్వేశ్వర సోమయాజులు, కల్పకం దంపతులకు 1952 ఆగస్టు 12న చెన్నై లో జన్మించిన సీతారాం ఏచూరి 1974లో ఎస్ఎఫ్ఐ చేరారు. 1975లో సిపిఎం ప్రాథమిక సభ్యుత్వంను తీసుకున్నారు. 1985లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైయ్యారు.
ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి నాయకత్వ స్థానంలోకి వచ్చిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. సీతారాం విద్యాభ్యాసం హైదరాబాద్ లో సాగింది. ఆ తర్వాత ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థికశాస్త్రంలో బీఏ, జవహర్ లాల్ వర్సిటీలో ఎంఏ పూర్తి చేశారు.

**సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి:**

ప్రముఖ రాజకీయవేత్త, వామపక్ష యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పై మఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. సీతారాం ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని అన్నారు. ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగుపెట్టిన ఏచూరి దాదాపు నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి అన్నారు. రాజ్య సభ ఎంపీగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా, సామాజిక కార్యకర్తగా ఆయన దేశంలో అందరికీ సుపరిచితుడయ్యారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని అన్నారు.

## నింగికేగిన మరో రాజకీయ ధృవతార

**న్యూఢిల్లీ:** రాజకీయ నేత, సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరికి అంత్యక్రియలు నిర్వహించరని పార్టీ తెలిపింది. ఆయన భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన తరవాత బాడీని ఎయిమ్స్‌కు అందచేస్తారు. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించటం లేదని కుటుంబ సభ్యులు కూడా తెలిపారు. ఆయన బతికి ఉన్నప్పుడే.. తాను చనిపోతే.. తన పార్థీవదేహాన్ని వైద్య పరీక్షల కోసం.. వైద్య విద్యార్థుల రీసెర్చ్ కోసం ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు ఆయన పార్థీవదేహాన్ని ఢిల్లీలోని ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు దానం చేయనున్నారు .
మెడికల్ కాలేజీకి ఆయన పార్థీవదేహాన్ని అప్పగించే ముందు.. ఢిల్లీలోని తన ఇంట్లో నివాళులు అర్పించనున్నారు. ప్రముఖులు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నేతలు అనుచరులు. ఇప్పటికే చాలా మంది ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా తమ సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో నివాళులు అర్పించిన తర్వాత.. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించకుండా.. ఆ పార్థీవదేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు అప్పగిస్తారు.

# ఎమ్మెల్యేలు రచ్చ.. రచ్చ



2లో



భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే గాంధీ

లోపలికి చొచ్చుకువెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు

రాళ్లు, టమాటాలు, కోడిగుడ్లతో దాడి

గాంధీ అరెస్ట్.. సాయంత్రం ఇంటికి తరలించిన పోలీసులు

భారాస నేతల అరెస్టుతో ఉద్రిక్తత

ఎమ్మెల్యే గాంధీపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కొండాపూర్‌లోని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసం దగ్గర ఆందోళన, దాడి వ్యవహారంలో సుమోటోగా కేసు నమోదు చేశారు.

పార్టీ ఫిరాయింపులపై హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీల మధ్య ఆరోపణలపర్వం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గాంధీ ఇంటికి వెళ్లి తాను భారాస జెండా ఎగురవేస్తానని కౌశిక్‌రెడ్డి సవాలువిసిరారు.

ఫిరాయింపులపై స్పీకర్ రాజ్యాంగబద్ధంగానే

# వ్యవహరిస్తారు

"ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ రాజ్యాంగబద్ధంగానే నిర్ణయం తీసుకుంటారు. అన్ని రాష్ట్రాల్లో జరిగినట్లే తెలంగాణలోనూ జరుగుతుంది. మా ప్రభుత్వం మొదలైనప్పటి నుంచి పడగొడతామని భారాస, భాజపాలే పదేపదే చెప్పాయి. కానీ, కేసీఆర్ లక్కీనంబరు మా దగ్గరున్నందున ప్రభుత్వానికేమీ ఢోకా లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు.



2లో

అన్ని రాష్ట్రాల్లో జరిగినట్లే ఇక్కడా జరుగుతుంది

మా ప్రభుత్వానికొచ్చిన ఢోకా ఏమీలేదు

కేసీఆర్ లక్కీ నంబర్ నా దగ్గరుంది

పీఏసీ అధ్యక్షుడిగా అరెకపూడి గాంధీ ఓటింగ్ ద్వారా ఎన్నికయ్యారు

మేం భారాసతో అప్రజాస్వామికంగా వ్యవహరించడంలేదు

కేంద్ర బృందం నివేదిక ఇచ్చాకే వరద నష్టంపై హోంమంత్రిని కలుస్తా

పార్టీలో నిర్ణయం తర్వాతే మంత్రివర్గ విస్తరణ

విలేకరులతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్




# హైదరాబాద్ బ్రాండ్‌కు విఘాతం

**హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. దమ్ముంటే కాస్కో అని ఒకరు అంటే.. తేల్చుకుందాం రా అని ఇంకొకరు అనడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ మాటల తూటాలతో ఇద్దరి వ్యక్తుల మధ్య నెలకొన్ని ఈ రచ్చ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య గొడవగా మారిపోయింది. అక్కడితో ఆగని ఇరువురూ.

. ఒకరిపై ఒకరు తిట్టిపోసుకున్నారు. కౌశిక్ ఓ బ్రోకర్ అని.. దమ్ముంటే బయటికి రా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి మరీ సవాల్ చేశారు గాంధీ. కట్టర్ తెలంగాణ బిడ్డనంటూ కౌశిక్ కౌంటరిచ్చారు. ఈ క్రమంలోనే కౌశిక్ ఇంటిపై కార్యకర్తలు, అనుచరులు టమోటాలు, గుడ్లతో దాడికి తెగబడ్డారు. ఈ వ్యవహారంతో ఒక్కసారిగా ఇది కాస్త ఉద్రిక్తంగా మారింది. ఈ ఉద్రిక్తతల మధ్యే గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు. సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రంగంలోకి దిగారు. కౌశిక్‌ను పరామర్శించేందుకు ఆయన ఇంటికి హరీశ్ బయల్దేరి వెళ్లారు.' మీ చర్యల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పోయింది. మా బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడైనా ఇలాంటి దాడులు జరిగాయా? గాంధీపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలి. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి. దాడిపై సీఎం రేవంత్ రెడ్డి ఏం సమాధానం చెబుతారు?. ప్రజలకు రేవంత్ రెడ్డి ఇచ్చే సందేశం ఏంటన్నారు. ఖమ్మంలో మాపై దాడి చేస్తే ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు.

# విద్యుత్తు కొనుగోలుకు అనుమతించండి

హైదరాబాద్: రోజువారీ అవసరాల నిమిత్తం ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజి (ఐఈఈ) నుంచి విద్యుత్తు కొనుగోలు చేయడానికి తెలంగాణ డిస్కంలకు అనుమతిస్తూ గురువారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు సరఫరా నిమిత్తం బుక్ చేసుకున్న కారిడార్ బకాయిలు చెల్లించనందున తెలంగాణ డిస్కంలను విద్యుత్తు క్రయ, విక్రయాలకు అనుమతించరాదంటూ ఐఈఈకి గురువారం జాతీయ పవర్ గ్రిడ్ సంస్థ రాసిన లేఖ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఆ లేఖను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కారిడార్ బకాయిలకు సంబంధించిన వివాదం కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్సీ)లో పెండింగ్‌లో ఉండగా ఐఈఈకి గ్రిడ్ కార్పొరేషన్ లేఖ రాయడాన్ని తప్పుబట్టింది. కరెంట్ కొనుగోలుకు అనుమతిస్తూ న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల సమాచారాన్ని ఐఈఈకి అందజేస్తానని కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రాసిన లేఖ ఆధారంగా ఐఈఈ విద్యుత్తు కొనుగోలుకు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ అత్యవసరంగా భోజన విరామ సమయంలో విచారణ చేపట్టాలంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి సాయంత్రం విచారణ చేపట్టారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి



వాదనలు వినిపించారు. "గ్రిడ్ కార్పొరేషన్‌కు చెందిన బకాయిల వివాదంపై సీఈఆర్సీలో పెండింగ్ ఉంది. ఈ దశలో గ్రిడ్ కార్పొరేషన్ ఇచ్చిన సమాచారంతో విద్యుత్తు కొనుగోలుకు పవర్ ఎక్స్ఛేంజీలు అనుమతించడంలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం రోజూ దాదాపు 240 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ అవసరం. అందులో 180 మిలియన్ యూనిట్‌లే రాష్ట్రంలో ఉత్పత్తి అవుతోంది. మరో 60 మిలియన్ యూనిట్‌లను కొంటున్నాం. తాజాగా గ్రిడ్ కార్పొరేషన్ లేఖ విద్యుత్ కొనుగోలుకు అడ్డంకిగా మారింది. వ్యవసాయం, పరిశ్రమలు, ఆస్పత్రులు, గృహావసరాల సరఫరాపై దీనిప్రభావం పడుతుంది" అని వివరించారు. ఈ వివాదానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కేంద్ర విద్యుత్తు శాఖ తదితర విభాగాలకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. విచారణను అక్టోబరు 10కి వాయిదా వేసింది.

వివాదం ఇదీ


తెలంగాణ డిస్కంలు ఛత్తీస్‌గఢ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీతో మర్వా థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు 2015 సెప్టెంబరు 22న ఒప్పందం కుదుర్చుకున్నాయి. అక్కడ నుంచి విద్యుత్ సరఫరా కోసం పవర్ గ్రిడ్‌తో 2,000 మెగావాట్ల సామర్థ్యముండే కారిడార్లను బుక్ చేశాయి. ఇందులో ఒక కారిడార్ 2017లో, రెండోది 2018 నవంబరు నుంచి ప్రారంభం కావాలి. కానీ.. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తుందనుకున్న విద్యుత్తు రావటం లేదని, 1,000 మెగావాట్ల కారిడార్‌ను మినహాయించాలని డిస్కంలు పవర్ గ్రిడ్‌ను అభ్యర్థించాయి. కానీ అది అంగీకరించలేదు. ఈలోపు రిలింక్విష్‌మెంట్ ఛార్జీలుగా రూ.261 కోట్లు తమకు చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో తెలంగాణ డిస్కంలు సీఈఆర్సీని ఆశ్రయించాయి. అక్కడ విచారణ కొనసాగుతోంది.

# ఫిరాయింపులపై స్పీకర్ రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తారు

దిల్లీ:"ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ రాజ్యాంగబద్ధంగానే నిర్ణయం తీసుకుంటారు. అన్ని రాష్ట్రాల్లో జరిగినట్లే తెలంగాణలోనూ జరుగుతుంది. మా ప్రభుత్వం మొదలైనప్పటి నుంచి పడగొడతామని భారాస, భాజపాలే పదేపదే చెప్పాయి. కానీ, కేసీఆర్ లక్కీనంబరు మా దగ్గరున్నందున ప్రభుత్వానికేమీ ఢోకా లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కూర్పుపై పార్టీ పెద్దలతో చర్చించడానికి దిల్లీకొచ్చిన ఆయన ఇక్కడ గురువారం తన అధికార నివాసంలో విలేకరులతో వివిధ అంశాలపై ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. అంతకుముందు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. తర్వాత తన నివాసంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలుతో కలిసి మధ్యాహ్న భోజన సమయంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కూర్పుపై సమాచాలోచనలు జరిపారు. పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాతే తాను విస్తరణపై ముందుకెళ్తానని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు ఇప్పుడే నియమితులయ్యారని, ఆయన్ను కొంత కుదురుకోనివ్వండని చెప్పడం ద్వారా విస్తరణకు మరికొంత సమయం పట్టే అవకాశముందన్న సంకేతం ఇచ్చారు. హైదరాబాద్‌లో పాత్రికేయుల గృహనిర్మాణ సంఘానికి భూమి అప్పగించినందుకు దిల్లీలోని పాత్రికేయులు ఆయనకు శాలువాకప్పి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడిన విషయాలు ఆయన మాటల్లోనే...

అదంతా భారాస మైండ్‌గేమ్‌లో భాగమే

ఉప ఎన్నికలొస్తాయని భారాస మైండ్‌గేమ్ ఆడేందుకు ప్రయత్నిస్తోంది. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై స్పీకర్లు రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటారు. అన్ని రాష్ట్రాల్లో జరిగినట్లే ఇక్కడా జరుగుతుంది. కేసీఆర్ కోసం కొత్త రాజ్యాంగమేమీ ఉండదు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితేనే అనర్హతవేటు వేయొచ్చంటే మా 65 మంది ఎమ్మెల్యేలు ఎప్పటికీ మా దగ్గరే ఉంటారు. అప్పుడు ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ ఉండదు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని భాజపా, భారాసలు ప్రకటించిన తర్వాతే ఈ చర్చ(ఫిరాయింపులు) మొదలైంది. భారాస వాళ్లు ఎన్ని ఉప ఎన్నికలు తెస్తారన్న దానిపై నేను మాట్లాడటంలేదు. ఎవరైనా అటూఇటూ



చూస్తే అనర్హత వేటుపడాలంటే ప్రభుత్వానికి వచ్చిన ఢోకా ఏమీ ఉండదు కదా. ప్రభుత్వానికి ఢోకానే లేనప్పుడు ఇలాంటి పంచాయతీలు అప్రస్తుతం. భారాస, భాజపాల నాయకులు కోర్టుకుపోయి ఏదో ఉత్తర్వులు తెచ్చామంటున్నారు. వారెలాంటి ఆదేశాలు తెచ్చినా అది పాలక పార్టీకి అనుకూలమే. మేం పక్కపార్టీల ఎమ్మెల్యేలను తీసుకున్నామని వారు ఆరోపిస్తున్నారు. అలా తీసుకొనే అవకాశమే లేకుండా చట్టాన్ని పకడ్బందీగా చేసి, తాళ్లు తెచ్చి కట్టేస్తే వాళ్లకంటే మేమే ఎక్కువ సంతోషిస్తాం.

వాళ్లు ప్రభుత్వం చేసే పనుల గురించి మాట్లాడకుండా తొలిరోజు నుంచే... నీ ప్రభుత్వం ఉండేది మూణ్నెళ్లే, ఆర్నెలే అనడమంటే అర్థం పడగొడతామనే కదా? ఒకవైపు పడగొడతామని చెబుతున్నది వాళ్లే... మరోవైపు పార్టీ ఎమ్మెల్యేలు ఎటూ కదలకుండా ఉండాలని చెబుతున్నదీ వాళ్లే. వారు చెప్పినట్లే ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా ఉండాలనే కోరుకుంటున్నా. అప్పుడు మా 65తోపాటు సీపీఐ ఎమ్మెల్యే కలిపి 66 మంది ప్రభుత్వం వైపు ఉంటారు. కేసీఆర్ లక్కీ నంబరు(6) నాదగ్గర ఉంది.

పీఏసీ పదవికి పార్టీ ప్రతిపాదన అవసరం లేదు

అరెకపూడి గాంధీకి భారాస సభ్యుడి హోదాలోనే ప్రజాపద్దుల సంఘం అధ్యక్ష పదవి దక్కింది. ఆ పదవికి పార్టీ ప్రతిపాదన అవసరం లేదు. అధ్యక్ష ఎన్నిక కోసం నోటిఫికేషన్ ఇస్తే ఆసక్తి ఉన్నవారు నామినేషన్లు వేశారు. రహస్య ఓటింగ్ విధానంలో

అరెకపూడి గాంధీ గెలిచారు. ఇదివరకు తెదేపా రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సీఎం రమేష్ కూడా ఇలా పీఏసీ సభ్యత్వానికి జరిగిన ఎన్నికలో 160 ఓట్లతో గెలిచారు. అసెంబ్లీ చివరిరోజు స్పీకర్... పార్టీల బలాబలాలను ప్రకటించారు. అందులో భారాస సభ్యుల సంఖ్యను 38గా చెప్పారు. దానికి భారాస నాయకులెవ్వరూ అభ్యంతరం వ్యక్తంచేయలేదు. అలాంటప్పుడు అరెకపూడి ఆ పార్టీ సభ్యుడికిందే లెక్క. ఇప్పుడు పీఏసీ ఉదంతాన్ని ప్రశ్నిస్తున్న వారు 2018 నుంచి 2023 వరకు కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ పీఏసీ ఛైర్మన్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ ఎలా వ్యవహరించారన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. 2014లో తెదేపాకు 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు పీఏసీలో ఆ పార్టీకి ఇద్దరు సభ్యుల నియామకానికి అవకాశం దక్కింది. అప్పుడు చంద్రబాబు నా పేరు, ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్లను స్పీకర్‌కు పంపారు. కానీ, అప్పటి స్పీకర్ రేవంత్‌రెడ్డి బదులు మరో పేరు సూచించాలని చంద్రబాబుకు చెప్పారు.

# ఎమ్మెల్యేలు రచ్చ.. రచ్చ

హైదరాబాద్, కూకట్‌పల్లి, రాయదుర్గం, నార్సింగి తలకొండపల్లి, కేశంపేట- న్యూస్‌టుడే: పార్టీ ఫిరాయింపులపై హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీల మధ్య ఆరోపణలపర్వం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గాంధీ ఇంటికి వెళ్లి తాను భారాస జెండా ఎగురవేస్తానని కౌశిక్‌రెడ్డి సవాలువిసిరారు. ప్రతిగా హైదరాబాద్ మసీదు బండ ప్రాంతంలోని కౌశిక్‌రెడ్డి ఇంటికి గాంధీ వెళ్లడంతో ఉద్రిక్తత తలెత్తింది. అక్కడ కాంగ్రెస్ శ్రేణులు, భారాస నాయకులు, కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. భారాస నేతల అరెస్టు సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కౌశిక్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై గాంధీ గురువారం ఉదయం నుంచే ఆగ్రహంతో ఉన్నారు. హైదరాబాద్‌లోని వివేకానందనగర్‌లో తన ఇంటికి వచ్చిన కార్యకర్తలతో మాట్లాడుతుండగా... కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. బుద్ధి చెప్పాలంటూ అనుచరులు నినాదాలు చేశారు. దీంతో ఆయన భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. కౌశిక్‌రెడ్డి మాటల వల్లే తాను స్పందిస్తున్నానని విలేకరులతో తెలిపారు. ఆయన భారాసలో చీడపురుగని వ్యాఖ్యానించారు. తన ఇంటిపై ఆ పార్టీ జెండా ఎగురవేసే అధికారం కౌశిక్‌రెడ్డికి ఎవరిచ్చారని గాంధీ ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చేటప్పుడు బాత్రూంలోకి వెళ్లి సమాచారాన్ని వేరే పార్టీకి చేరవేసి దళారీలా వ్యవహరించిన తీరు గుర్తుకురాలేదా అని ఆరోపించారు. ఏడున్నర లక్షల మంది ఓటర్లకు తాను ప్రతినిధినని, వారికే జవాబుదారీగా ఉంటానని తెలిపారు. మసీదుబండలో కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లిన గాంధీ అనుచరులు రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలు విసిరేశారు. పూలకుండీలను ధ్వంసం చేశారు. ఇంట్లోకి దూసుకెళ్తుండగా భారాస కార్యకర్తలు, పోలీసులు వారిని అడ్డుకున్నారు. అప్పటికే కిటికీ అద్దాలు పగిలిపోయాయి. పరిస్థితి విషమిస్తుండడంతో పోలీసులు గాంధీని అరెస్ట్ చేసి నార్సింగి పోలీస్‌ఠాణాకు తరలించారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఆయన్ను ఇంటికి తరలించారు. గాంధీతో పాటు మరికొందరికి సాయంత్రం సమయంలో నోటీసులిచ్చి వదిలేశారు.

గృహనిర్బంధం... భారాస ఎమ్మెల్యేల రాక

ఎమ్మెల్యే గాంధీ నివాసానికి వెళ్లేందుకు కౌశిక్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు గురువారం ఉదయం ఆయన్ను గృహనిర్బంధం చేశారు. తనను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ కౌశిక్‌రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. మేడ్చల్ జిల్లా భారాస కార్యాలయం నుంచి శుక్రవారం ఉదయం వందల మంది భారాస కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే



గాంధీ ఇంటికి వెళ్దామంటూ శ్రేణులకు పిలుపునిచ్చారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి సమాచారం తెలుసుకున్న భారాస నేతలు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాధవరం కృష్ణారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబిత తదితరులు ఆయన నివాసానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు.

ఉద్రిక్తత మధ్య ఠాణాకు తరలింపు

కౌశిక్‌రెడ్డి ఇంటిపైదాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని, ఎమ్మెల్యే గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు, కార్యకర్తలు మధ్యాహ్నం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చేరుకున్నారు. పదుల సంఖ్యలో, నాయకులు, కార్యకర్తలు రావడంతో పోలీసులు అనుమతించలేదు. దీంతో పోలీస్ ఉన్నతాధికారులకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్ చేయగా ముఖ్య నాయకులు రావాలంటూ సంయుక్త కమిషనర్ జోయల్ డేవిస్ చెప్పారు. ఆయన్ను కలిసేందుకు వెళ్తుండగా.. వారిని కార్యకర్తలు అనుసరించారు. పోలీసులు అనుమతించకపోవడంతో కౌశిక్‌రెడ్డి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే గాంధీపై కేసులు నమోదు చేసేంతవరకూ తాము కదలబోమంటూ ఆందోళనకు దిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరుల్ని పోలీసులు అదుపులోకి తీసుకుని తలకొండపల్లి, కేశంపేట పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మార్గంమధ్యలో భారాస శ్రేణులు అడుగడుగునా ఆందోళనలకు దిగడంతో పటిష్ఠ బందోబస్తు నడుమ తీసుకెళ్లారు. భారాస ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్, సంజయ్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శంభీపూర్‌రాజు తదితరుల్ని తలకొండపల్లికి తరలించారు.

రాత్రి 9.30 గంటల సమయంలో వారిని వదిలేశారు. ఆందోళనల దృష్ట్యా మాజీ మంత్రి

హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఉన్న వాహనాన్ని కేశంపేట ఠాణాకు తరలించారు. హరీశ్‌రావు ఉన్న వాహనాన్ని భారాస శ్రేణులు వాహనాలను అనుసరించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశాయి. వాహనాలు షాద్‌నగర్ దాటాక ఆందోళనలు మరింత పెరిగాయి. కేశంపేట మండలం అల్వాల్ దగ్గర భారాస కార్యకర్తలు వాహనాలను అడ్డుకున్నారు. ఎంతకీ కదలకపోవడంతో పోలీసులు చెదరగొట్టారు. కేశంపేట ఠాణాలో భారాస నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

# 17న ప్రజాపాలన దినోత్సవం

హైదరాబాద్,: తెలంగాణ విమోచన దినం..సందర్భంగా ఈనెల 17వ తేదీన నిర్వహించే ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఉదయం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లపై అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సమీక్షించారు. ప్రజా పాలన దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై డా. బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి అధికారుల సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవమైన 17వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను సి.ఎస్. ఆదేశించారు. సభా స్థలంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్వానితుల వాహనాలకు సరైన పార్కింగ్ సదుపాయం, శానిటేషన్, పీఏ సిస్టం, భద్రతా తదితర ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. 17న గణేశ్ నిమజ్జనం ఉన్నందున ఈ సమావేశానికి హాజరయ్యే వారికి ట్రాఫిక్ నియంత్రణ, తగు మార్గాలను ముందస్తుగా తెలియచేయాలని నగర పోలీసు అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వీ ఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవీ గుప్తా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ÷ర్ సర్వీసులు డీజీ నాగి రెడ్డి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ అడ్మిషన్లలో స్థానికత వ్యవహారం

న్యూఢిలీ: మెడికల్ అడ్మిషన్లకు స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ శాశ్వత నివాసులు రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానిక రిజర్వేషన్ వర్తించదన్న ప్రభుత్వ నిబంధనను కొట్టివేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించరాదని హైకోర్టు ఆదేశాల్లో పేర్కొంది. ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది మెన్షన్ చేశారు.

త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం వెల్లడించింది. కాగా... తొమ్మిదో తరగతి నుంచి వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వాళ్లే.. రాష్ట్రంలో వైద్య విద్యకు స్థానిక కోటాలో అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. తెలంగాణలో శాశ్వత నివాసితులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొంటూ.. 'తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్-2017'కు జీవో 33 ద్వారా ప్రభుత్వం తెచ్చిన సవరణ, రూల్ 3(ఏ)ని పునర్నిర్వచించింది. శాశ్వత నివాసులు కేవలం రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటే.. స్థానికులు కాకుండా పోబోరని అభిప్రాయ పడింది. శాశ్వత నివాసులైన విద్యార్థులను గుర్తించి, వారికి మెడిసిన్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో వైద్యవిద్యలో అడ్మిషన్లకు ప్రభుత్వం 2017లో నిబంధనలను రూపొందించింది. అయితే.. విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియడంతో.. ఆ నిబంధనలకు సవరణలను తీసుకొస్తూ.. సర్కారు జూలై 19న జీవో 33ని తీసుకుని వచ్చింది. దీని ప్రకారం.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు అని రూల్ 3(ఏ)లో నిర్వచించింది. అయితే.. ఇంటర్‌తోపాటు నీట్ కోచింగ్, ఇతరత్రా కారణాల వల్ల వేరే రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ శాశ్వత స్థానికులైన విద్యార్థుల పాలిట ఈ నిర్వచనం శరాఘాతంగా మారింది. సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోవడంపై 130 మందికి పైగా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. 53 వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. తెలంగాణ స్థానికులమే అయినా.. కేవలం ఒకట్రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కాంపిటెంట్ కోటాలో 85శాతం సీట్లకు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించడం చెల్లదని కోర్టుకు వివరించారు.

పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రావు వాదనలను వినిపించారు. 'ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ముగియడంతో.. తెలంగాణ లోకల్ ఏరియాగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దాంతో రూల్స్ సవరించాం. తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం' అని పేర్కొన్నారు.

# సిజెఐ చంద్రచూడ్ నివాసంలో వినాయక పూజ

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నివాసంలో జరిగిన వినాయక పూజలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. సిజెఐ ఇంటికి వెళ్లిన ప్రధాని మోడీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయమూర్తులు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్టేనని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు. ప్రశాంత్ తన ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ప్రైవేట్ మీట్ కోసం సిజెఐ చంద్రచూడ్ తన నివాసానికి మోడీని అనుమతించడం మంచిది కాదు అని, ఇలాంటి సమయంలో న్యాయవ్యవస్థపై ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని భూషణ్ పేర్కొన్నారు. సిజెఐ ఇంట్లో జరిగిన గణపతి పూజలో ప్రధాని మోడీ పాల్గొన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిజెఐ ఇంటికి ప్రధాని వెళ్లడం ఎంత వరకు సరైందని నెటిజన్లు నిలదీస్తుండగా మరికొందరు సమర్థిస్తున్నారు. సిజెఐ ఇంట్లో ప్రధాని పూజలో పాల్గొనడం తప్పుడు సంకేతాలు ఎలా అవుతాయని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు.

# ప్రజల కోసం అవసరమైతే రాజీనామా చేస్తా


## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగిస్తున్న జూనియర్ వైద్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చల విషయమై ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు.



ప్రజల ప్రయోజనం కోసం అవసరమైతే తాను రాజీనామా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఆర్జీ కర్ ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వైద్యులతో సమావేశం కోసం గురువారం దాదాపు రెండు గంటలపాటు ఎదురుచూశానని, అయినప్పటికీ వారి నుంచి స్పందన లేకుండా పోయిందన్నారు.

'ప్రస్తుతం ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. అందువల్ల.. జూనియర్ వైద్యులు డిమాండ్ చేసినట్లు చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయలేం. అయితే.. ఈ భేటీని వీడియో రికార్డింగ్‌కు అనుమతిస్తాం. సుప్రీంకోర్టు అనుమతితో ఆ ఫుటేజీని వైద్యులకు అందజేస్తాం. చర్చలు జరిపేందుకు ఇప్పటికే మూడుసార్లు యత్నించాను. వైద్యులు విధులకు దూరంగా ఉండటంతో ఏడు లక్షల మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 27 మంది మృతి చెందారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోను. పెద్దవాళ్లం కాబట్టి వారిని క్షమిస్తాను' అని మమతా బెనర్జీ చెప్పారు.



3
శుక్రవారం 13 సెప్టెంబర్ 2024


# కల్లు "సొసైటీలో అక్రమార్కుల"పై చర్యలు తీసుకోవాలి.

## - మూడవ డిపో పై ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు గీతా కార్మికులు ఫిర్యాదు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 12:**




జిల్లా కేంద్రంలోని మూడవ కల్లు డిపోలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని మూడవ సొసైటీ గీతా కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి కి గీతా కార్మికులు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా గీతా కార్మికులు మాట్లాడుతూ, నిజామాబాద్ నగరంలోని భవాని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం (మూడవ) కల్లు సొసైటీలో గీత కార్మికులకు జరిగి నటువంటి అక్రమాలపై వివరించారు. సొసైటీ కి వచ్చిన డబ్బులలో రవీందర్ గౌడ్, సేపూర్ సుమన్ గౌడ్, సేపూర్ స్వామి గౌడ్, సేపూర్ జైసింహ గౌడ్ లు కొంత మంది బయట వ్యక్తులు లక్షల రూపాయలు వేతనాల రూపంలో తీసుకోవడమే కాకుండా సొసైటీ కి వచ్చిన లాభాలను కూడా నెల నెల తినేస్తున్నారనీ ఆరోపించారు. కార్మికులకు మాత్రం కేవలం గత సంవత్సరం నుండి రూ.4వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. గత కొద్దిరోజులుగా మూడవ కల్లు డిపో లో గీత కార్మికులకు రావలసిన వాటాల డబ్బులను సొసైటీ అధ్యక్షుడు కె.రవీందర్ గౌడ్ గీత కార్మికులకు పంచాల్సిన డబ్బులను కొందరు వ్యక్తులతో కుమ్మక్కై సేపూర్ స్వామి గౌడ్, సేపూర్ సుమన్ గౌడ్



లతో కలిసి కాజేస్తున్నారనీ ఆరోపించారు. అలాగే సోసైటీ కి సంబంధం లేని వ్యక్తులకు లక్షల రూపాయలు తీసుకుని కార్మికుల వాటాలను బయట వ్యక్తులకు అమ్ముకున్నారని, విచారణ జరిపి కార్మి కులకు న్యాయం చేయాలని కోరారు. కల్లు డిపో లో తిష్టవేసిన బుర్ర శ్యామ్ సుందర్ గౌడ్, నాగరాజు గౌడ్ లను బయటకు పంపాలని, కార్మికులే డిపో ని నిర్వ హించేలా చర్యలు తీసుకుని, కార్మికులకు రావాల్సిన లాభాలను సొసైటీ అధ్యక్షుడు నుండి లెక్కలు చేయించి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి రాజా గౌడ్, తిరుమలేష్ గౌడ్, ఏ.శ్రీనివాస్ గౌడ్, గడ్డం లక్ష్మణ్ గౌడ్, లాలాగౌడ్, ఇడిగిరాల శ్రీనివాస్ గౌడ్, రాజగోపాల్ గౌడ్, సిరి గదా స్వామి గౌడ్, సూర్య ప్రకాష్ గౌడ్, సుభాష్ గౌడ్ లతో పాటు కార్మికులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాలకు తీరని లోటు: బిఎల్ పి.





సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కమిటి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఏచూరి మరణం దేశంలో ప్రజా ఉద్యమాలకు తీరని లోటని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ది రాములు అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వామపక్ష ఉద్యమానికి ఏచూరి వెన్నెముకగా నిలిచారని పేర్కొన్నారు.




## ప్రజా పాలన దినోత్సవము ఘనంగా నిర్వహించాలి.

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 12:**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవము ఈ నెల 17 న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం రోజున జిల్లా కార్యాలయాల భవన సముదాయం సమావేశ మందిరంలో ఎస్పీ సిందూ శర్మ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఈ నెల 17 న తెలంగాణా ప్రజా పాలన కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో నిర్వహించడం జరుగుతుందని, అట్టి కార్యక్రమ నిర్వహణకు శాఖల వారీగా కెటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, డిఎస్పీ నరసింహ రెడ్డి, సి.పై. ఒ.రాజారాం, మున్సిపల్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైద్యారోగ్య శాఖ పనితీరులో మార్పు కనిపించాలి.

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

## వైద్యుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని డీఎంహెచ్ఓకు ఆదేశం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 12**




వైద్యారోగ్య శాఖ పనితీరును మరింతగా పటిష్టపర్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. మోపాల్ మండలం ముదక్ పల్లిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను, ఔషధాలు నిలువ ఉంచిన స్టోర్ రూమ్, రోగుల ఇన్ పేషంట్ వార్డు, ల్యాబ్ తదితర వాటిని సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీయగా, పలువురు అందుబాటులో లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముదక్ పల్లి పీ.హెచ్.సీ పరిధిలో డెంగ్యూ కేసులు నమోదవుతుండడాన్ని గమనించి, అందుకు గల కారణాలు ఏమిటని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వ్యాప్తంగా గల అన్ని పీ.హెచ్.సీలు, ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని, ప్రతిరోజూ ఉదయం వేళలోనే అటెండెన్స్ ను పర్యవేక్షించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖలో స్పష్టమైన మార్పు కనిపించాలని, క్షేత్ర స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గాడిలో పెట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని ఆసుపత్రులు, పీ.హెచ్.సీల వైద్యులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకిత భావంతో వైద్యసేవలు అందించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ఎక్కడైనా పీ.హెచ్.సీలో వైద్యాధికారి సెలవులో ఉంటే, ఇతర ఆసుపత్రుల నుండి ప్రత్యామ్నాయంగా వైద్యులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు. పాము కాటు, కుక్కకాటు మందులతో పాటు అన్ని అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు.

# నింగికేగిన మరో రాజకీయ ధృవతార

**న్యూఢిల్లీ:** మాటల్లో మెతకదనం..భావంలో తీవ్రత..మృదు స్వభావం ఆయన సొంతం. మెతకగా ఉన్నట్లు కనిపించినా...దేశం కోసం పాటుపడే ఆయన అతురత చురకత్తిలా ఉండేది. సమస్య ఎక్కడ ఉన్నా పరుగెత్తే ప్రవాహం ఆయన నైజం. చిన్న వయసులోనే రాజకీయాల్లో ఆరితేరారు. వామపక్షభావజాలం అనుఅణువూ నింపుకున్న ఏచూరి..నిరంతరం భారత ఆర్థిక అభివృద్ధి కోసం తపించేవారు. ఆయనే సీతారం ఏచూరి. ఇంతటి మహోన్నతుడు భారత రాజకీయాల్లో తనకంటూ ఓ చరిత్ర లిఖించుకున్నారు. అత్యతం పిన్నవయసులోనే దేశంలో అత్యున్నత స్థానానికి ఎదిగిన తెలుగు బిడ్డ.
సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో దిల్లీ ఎయిమ్స్‌లో కొద్ది వారాలుగా చికిత్స పొందిన ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో భారత రాజకీయాల్లో ఓ ధృవతార నింగికేగింది. ఆయన మృతికి ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ, సిపిఎం పోలిట్ బ్యూరో సమా పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త, కాలమిస్ట్‌గా గుర్తింపు పొందిన ఏచూరి.. 1992 నుంచి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. 32 ఏళ్లుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగు తున్న ఏచూరి 2015లో ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2005 – 2017 వరకు బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. ఆయన పూర్తిపేరు ఏచూరి సీతారామరావు. 1952 ఆగస్టు 12 చెన్నైలో వైదేహి బ్రాహ్మణులైన సర్వేశ్వర సోమయాజులు ఏచూరి,కల్పకం దంపతులకు జన్మించారు. తండ్రి సర్వేశ్వర సోమయాజులు ఏచూరి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్లో ఇంజినీర్‌గా పని చేశారు. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారిగా ఉండేవారు. ఏచూరి బాల్యం ఎక్కువగా హైదరాబాద్‌లోనే సాగింది. భాగ్యనగరంలోని అల్ సెయింట్స్ హైస్కూల్లో ఆయన మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్లో చేరారు. 1970లో సీబీఎస్సీ సెకండరీ పరీక్షల్లో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అనంతరం అక్కడే పీహెచ్డీ కోర్సులో చేరారు. అయితే అప్పటికే దేశవ్యాప్తంగా ఎమ్జ్గం÷న్సీ విధించడం.. ఏచూరీని అరెస్ట్ చేయడంతో పీహెచ్‌డీని కొనసాగించలేకపోయారు. సీతారం ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. ఆయన మొదటి భార్య ఇంద్రాణి మజుందార్ కాగా.. జర్నలిస్టు సీమా చిత్తీ రెండో భార్య. ఏచూరి రెండో భార్య సీమా చిస్తీ జర్నలిస్టు. తన భార్య తనకు ఆర్థికంగా సహకరిస్తుందని ఏచూరి ఒకసారి చెప్పారు. మొదటి
భార్యకి ఒక కుమార్తె, కుమారుడు సంతానం ఉండేది. అయితే కుమారుడు ఆశిష్.. 2021 ఏప్రిల్ 22న కొవిడ్‌తో మరణించారు. తప్పు జరిగితే సహించలేని మనస్థత్వం ఏచూరిది. అందుకే చిన్నప్పటి నుంచే రాజకీయాల్లోకి రావాలనే కుతూహలం ఉండేది.
విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఎస్ఐ నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది.
**న్యూఢిల్లీ,:** సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. దేశ రాజకీయాల్లో ఆయన పాత్రను కొనియాడుతూ.. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ 'ఎక్స్'లో పోస్టులు పెట్టారు. ఏచూరి మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. భారత రాజకీయాల్లో ఆయన గౌరవస్థానం పొందారన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మేధావి అని కొనియాడారు. అట్టడుగు వర్గాల ప్రజలతో మంచి అనుబంధం ఉన్న నేత అన్నారు. విశాల దృక్పథంతో కూడిన రాజకీయ చర్చలు పార్టీకి అతీతంగా ఆయనకు గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు. సీతారాం ఏచూరి మరణం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తనకు మంచి మిత్రుడు, ఆప్తుడన్నారు. ఇకపై ఏచూరితో సుదీర్ఘ చర్చలను కోల్పోతానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏచూరి మన దేశం పట్ల లోతైన అవగాహన ఉన్న నేత 'ఐడియా ఆఫ్ ఇండియా'కు రక్షకుడిగా పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో ఏచూరి కుటుంబ సభ్యులు, స్నేహితులు, అనుచరులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏచూరి మరణం పట్ల బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఒక ప్రముఖ పార్లమెంటేరియన్ అని.. అలాంటి గొప్ప నేత మరణం జాతీయ రాజకీయాలకు తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబానికి, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఏచూరి మరణం దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు. ఏచూరి నిష్ణాతుడైన రాజకీయవేత్త, ఆలోచనాపరుడు. ప్రజా ప్రయోజనాల కోసం ఆయన పునరంకితమయ్యారని జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ అన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తీవ్ర విషాదం నింపింది. ప్రజా పోరాట యోధుడిని కోల్పోయాం. ప్రజా ఉద్యమాలకే జీవితం అంకితం చేసిన వారికి కన్నీటి నివాళులు అర్పిస్తున్నాను. అమర్ రహే కామ్రేడ్ సీతారాం ఏచూరి అని నారా లోకేశ్ సంతాపం తెలిపారు.
సీపీఎం అగ్రనేత ఏచూరి మరణం పట్ల కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, కిరణ్ రిజుజు తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏచూరి మరణం నన్ను కలచివేసింది. ఆయన నాకు మంచి మిత్రుడు. నికార్సయిన కమ్యూనిస్టు యోధుడు. విద్యార్థి ఉద్యమాల్లో చురకైన పాత్ర పోషించిన ఏచూరి.. దేశ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. గొప్ప వక్త. వామపక్ష ఉద్యమాలకు దిక్సూచి. ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు. నేటి తరం నేతలు ఆయన పంథాను ఆదర్శంగా తీసుకొని అంతరాల్లేని సమాజం కోసం కృషి చేయడయే నిజమైన నివాళని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. సీతారాం ఏచూరి ప్రజల తరఫున బలమైన గొంతుకగా పనిచేశారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఏచూరి అంటే ఒక వ్యక్తి కాదు.. శక్తి. దేశంలోని అగ్ర నాయకుల్లో ఒకరైన ఆయన అందరితోనూ ఆప్యాయంగా మెలిగేవారు. పార్లమెంటులో ఆయన ప్రసంగిస్తుంటే.. అందరూ ఆసక్తిగా వినేవారు. సభ్యులు ఆ అంశాలను నోట్ చేసుకొనేవారు. మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చారు. ఆయన ఆశయ సాధనలో నడవాలని సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు.

### లెఫ్ట్ ఉద్యమంలో చెరగని ముద్ర


న్యూఢిల్లీ: భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసారు. విద్యార్థి ఉద్యమం నుంచి నాయకత్వ స్థానంలోకి వచ్చిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారు. 1974లో ఎస్ఎఫ్ఐ చేరారు. 1975లో సిపిఎం ప్రాధమిక సభ్యత్వంను తీసుకున్నారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. 1985లో పన్నెండవ పార్టీ కాంగ్రెస్ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పి సుందరయ్య, ఇఎంఎస్, బిటిఆర్, హరికిషన్ సింగ్ సూర్జిత్, బసవ పున్నయ్య మరియు జ్యోతిబసు వంటి సీనియర్ నాయకులతో కలిసి పనిచేశారు. 1992లో జరిగిన 14వ పార్టీ కాంగ్రెస్ సెషన్‌తో పొలిట్‌బ్యూరోకు చేరుకున్నారు.మతతత్వం,నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఏచూరి క్రమం తప్పకుండా పార్లమెంటులో జోక్యం చేసుకున్నారు. రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖల స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ముఖ్యమైన నివేదికల తయారీకి ఆయన నాయకత్వం వహించారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, 2004లో మొదటియూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో ఏచూరి కీలకపాత్ర పోషించారు. భారతీయ రాజకీయ, సామాజిక పరిస్థితులను ప్రజా ఉద్యమాలకు తాత్విక స్పష్టతతో తీర్చిదిద్దే రాజకీయ, సంస్థాగత బాధ్యతను నిర్వర్తించిన నాయకుడు ఏచూరి. ఆయన భార్య ప్రముఖ పాత్రికేయురాలు, రచయిత్రి సీమా చిస్తీ. బ్రిటన్‌లో యూనివర్సిటీ టీచర్‌గా పనిచేస్తున్న అఖిలా ఏచూరి, జర్నలిస్టు ఆశిష్ ఏచూరిల పిల్లలు.






# ఓటీటీలోకి వచ్చేసిన మిస్టర్ బచ్చన్

ఎన్నో అంచనాల మధ్య గత నెల ఆగస్టు15న ప్రేక్షకుల ముందుకు వచ్చి బోర్లా పడిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఒటిటిలోకి వచ్చేసింది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మాస్ మహారాజ రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. 2018లో అజయ్ దేవ్‌గణ్ హీరోగా హిందీలో సూపర్ హిట్ అయిన రైడ్ చిత్రాన్ని కాస్త మార్పులు చేసి తెలుగులో రీమేక్ చేశారు. సినిమా షూటింగ్ ప్రారంభం నుంచి ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్లు, పాటలు, ప్రచార కార్యక్రమాలు సినిమాపై బాగా హైప్ తీసుకు రాగా థియేటర్లోకి వచ్చి తీవ్రంగా నిరాశ పర్చింది. ఇప్పుడు ఈ సినిమా ఈ గురువారం నుంచి ఓటీటీలోకి వచ్చింది. కథ విషయానికి వస్తే.. ఓ నిజాయితీ అధికారి, అవినీతి ఎంపీ మధ్య జరిగే క్యాట్ అండ్ మౌస్ గేమ్ ఈ చిత్రం. రాజకీయంగా అందరినీ శాసించే క్రూరుడు, అధికారులని ఓ రేంజ్‌లో భయపెట్టే ఎంపీ ముత్యం జగ్గయ్య (జగపతి బాబు) ఇంటిపై నిజాయితీ గల అధికారి బచ్చన్ రైడ్‌కు వెళతాడు. ఈ క్రమంలో బచ్చన్ ఆ ఇంట్లో రైడ్ చేయగలిగాడా, అక్కడ అతనికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయనేదే కథ. అదే సమయంలో తన ఊరిలో ఓ మార్వాడి అమ్మాయితో బచ్చన్ ప్రేమ వ్యవహారం, సత్య కామెడీ ట్రాక్ ఇంకా ఓ నాలుగైదు క్యారుకట్ల్ల చుట్టూ సినిమా సాగుతుంది. ఇప్పుడి సినిమా నెట్ ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే.. సినిమా అంతా మొదటి నుంచి చివరి వరకు రవితేజ మయంగా కనిపిస్తుంది. ప్రేక్షకులు రవితేజను ఎలా చూడాలనుకుంటారో దర్శకుడు అలానే చూపించాడు కూడా. కానీ ఆయన క్యారెక్టర్ ముందు ఇతర పాత్రలన్నీ తేలిపోయాయి. ఉన్నంతలో భాగ్యశ్రీ అందం, అమాయకపు నటన, పాటల్లో ఒలకబోసిన గ్లామర్, డ్యాన్స్ పెద్ద ఎస్సెట్. ఆ తర్వాత సత్య కామెడీ ఫస్టాఫ్‌ను నిలబెట్టగా సినిమా మొత్తానికి మిక్కీ జే మేయర్ సంగీతం చాలా బలాన్ని చేకూర్చింది. సినిమా థియేటర్లలో చూడని వారు, ఎలాంటి అంచనాలు లేకుండా ఈ 'మిస్టర్ బచ్చన్' మూవీని ఒక్కసారి చూసేయవచ్చు.








# యూరోప్‌లో రొమాన్స్ చేయనున్న సికిందర్

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, తమిళ డైరెక్టర్ ఏ.ఆర్.మురుగుదాస్ కలయికలో తెరకెక్కుతోన్న చిత్రం 'సికందర్'. సత్యరాజ్, ప్రతీక్ బబ్బర్ కీలక పాత్రలు పోషిస్తుండగా.. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దాదాపు రూ.400 కోట్ల బడ్జెట్‌తో సాజిద్ నడియాడ్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. అయితే, ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో నటించడానికి కాజల్ అగర్వాల్ ఓకే చెప్పిందని, ప్రస్తుతం ఆమె సెట్స్‌లోకి అడుగుపెట్టిందనేలా టాక్ వినబడుతోంది. ఇదిలా ఉంటే.. రెండు రొమాంటిక్ సాంగ్స్ షూట్ చేసే నిమిత్తం నేషనల్ క్రష్ రష్మిక మందన్నాతో కలిసి సల్మాన్ ఖాన్ యూరప్‌కు వెళ్తున్నారనేలా బాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్త 'సికిందర్' సినిమాని వార్తలలో ఉంచుతూ, సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యేలా చేస్తోంది. సల్మాన్, రష్మికలపై రొమాంటిక్ సాంగ్స్‌ని యూరప్‌లో చిత్రీకరించేందుకు అన్నీ సిద్ధం చేశారని, టీమ్ ఇప్పటికే యూరప్ చేరుకుందనేలా బీటౌన్‌లో వినిపిస్తుంది. ఈ సాంగ్స్‌కి ఓ ప్రత్యేకత కూడా ఉండబోతుందట. అదేంటనేది త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు. ప్రీతమ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. పాపులర్ యాక్టర్ సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమాను ఎప్పటిలానే మురుగదాస్ సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలోతెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది.

# చిత్రసీమలో నెపోటిజం.. నిజమేనంటున్న రకుల్

నెపోటిజం ఈ పదం సినిమా రంగంలో ఎక్కువగా వినిపిస్తుంటుంది. తమ సినిమా ప్రచారంలో భాగంగా ఇంటర్వ్యూల్లో పాల్గొన్న నటులకు తరచూ దానిపై ప్రశ్న ఎదురవుతుంటుంది. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ దీనిపై స్పందించారు. ఎలాంటి సినీనేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన రకుల్.. టాలీవుడ్, బాలీవుడ్‌లలో స్టార్ హీరోల సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ, తన కెరీర్‌లో నెపోటిజం కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయినట్లు తాజాగా తెలిపారు. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడే రకుల్.. బంధుప్రీతిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పరిశ్రమలో నెపోటిజం ఉన్నమాట వాస్తవం. నేను దీని కారణంగా అవకాశాలు కోల్పోయాను. అవి నాకు దక్కలేదని బాధ పడలేదు. ఆ సినిమాలు నన్ను ఉద్దేశించినవి కాదని ముందుకుసాగాను. నా తండ్రి సైన్యంలో పనిచేసేవారు. ఆయన సలహాలు, అనుభవం నాకు ఎన్నో నేర్పాయి. చిన్నచిన్న వాటి గురించి ఆలోచించను. అవకాశాలు కోల్పోవడం జీవితంలో ఓ భాగం. నాకు దక్కని వాటి గురించి ఆలోచించి సమయం వృథా చేసుకోను. ఏం చేస్తే నేను వ్యక్తిగతంగా ఎదుగుతానో దానిపై శ్రద్ధ పెడతాను. ఒక స్టార్ కిడ్‌కు లభించినంత సులభంగా మిగతా వారికి ఛాన్స్‌లు రావు. అదంతా వారి తల్లిదండ్రుల కష్టం' అని రకుల్ వివరించారు. ప్రస్తుతం అజయ్‌దేవగణ్ జంటగా రకుల్‌ప్రీత్ సింగ్ 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నారు. విజయవంతమైన 'దే దే ప్యార్ దే'కి కొనసాగింపుగా అన్షుల్ శర్మ దీన్ని తెరకెక్కిస్తున్నారు.



# దేవర మూవీ సెన్సార్ పూర్తి

## 2 గంటల 57 నిమిషాల 58 సెకన్ల రన్‌టైమ్



ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన చిత్రం 'దేవర'. పార్ట్ 1 ఈ నెల 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. నిడివి: 2 గంటల 57 నిమిషాల 58 సెకన్లు. ఇటీవల బాక్సాఫీసు ముందుకొచ్చిన పలు చిత్రాల నిడివి దాదాపు 3 గంటలు ఉండటం గమనార్హం. కంటెంట్ బాగుంటే రన్‌టైమ్ ఎంతున్నా ప్రేక్షకుల ఆదరణ దక్కుతుందనే విషయాన్ని 'కల్కి' (180.56 నిమిషాలు), 'సరిపోదా శనివారం' (2: 50 గంటలు)లాంటి చిత్రాలు మరోసారి నిరూపించాయి. 'జనతా గ్యారేజ్' తర్వాత ఎన్టీఆర్- కొరటాల శివ కాంబోలో తెరకెక్కిన సినిమా కావడంతో ముందు నుంచీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. విజువల్స్ అద్భుతంగా ఉంటాయని, చివరి 40 నిమిషాలు సినిమాలో హైలైట్ అంటూ ముంబయిలో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎన్టీఆర్ అంచనాలు రెట్టింపు చేశారు. ఈ సినిమాతో జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి వస్తున్నారు. సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. నార్త్ అమెరికాలో అత్యంత వేగంగా టికెట్ల ప్రీ సేల్ ద్వారానే వన్ మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరిన సినిమాగా 'దేవర' నిలిచిన సంగతి తెలిసిందే. ట్రైలర్ కూడా రిలీజ్ కాకముందే ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చిత్రంగా రికార్డు నెలకొల్పింది.

# గీతరచయిత గురుచరణ్ కన్నుమూత

తెలుగు సినీ పరిశ్రమలో విషాదం. ప్రముఖ తెలుగు సినీ గీత రచయిత గురుచరణ్ (77) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇవాళ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఇక గురుచరణ్ మరణవార్త తెలుసుకున్న సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నారు.గురుచరణ్ అసలు పేరు మానాపురపు రాజేందప్రసాద్. ప్రముఖ దర్శకుడు మానాపురపు అప్పారావు, నటి ఎంఆర్ తిలకం దంపతుల కుమారుడు ఇతను. గురుచరణ్‌కు చిన్ననాటి నుంచే సినిమా పాటలు రాయడం అంటే ఆసక్తి ఉండడంతో ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశాడు. అనంతరం దాదాపు దాదాపు రెండు వందలకు పైగా సినిమా పాటలు రాశారు. రౌడీ గారి పెళ్లాం లోని బోయవాని వేటుకు గాయపడిన కోయిల, అల్లుడుగారు సినిమాలోని ముద్దబంతి నవ్వులో మూగబాసలు లాంటి పాటలు అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచాయి.

# రాజమౌళి సినిమాతోనే నేరుగా హిందీలోకి

## పాత సినిమాలను డబ్ చేయవద్దన్న మహేశ్ ?

మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ రూపొందనున్న సంగతి తెలిసిందే. 'ఎస్ఎస్ఎంబి29'గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమాను పాన్ ఇండియా సినిమాగా తీసుకు రాబోతున్నారు. దీంతో ఈ సినిమాతోనే నేరుగా హిందీలో అడుగు పెట్టాలని నటుడు మహేశ్ బాబు భావిస్తున్నట్లు సమాచారం. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన సినిమాల విషయంలో మహేశ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. రాజమౌళి ప్రాజెక్ట్‌తో మహేశ్ పాన్ వరల్డ్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో బాలీవుడ్ వెండితెరపై ఈ సినిమాతోనే హిందీ ఆడియన్స్‌ను పలకరించాలని ఆయన ఫిక్స్ అయ్యారట. అందుకే 'ఎస్ఎస్ఎంబి29' విడుదలయ్యే వరకు తన గత చిత్రాలను హిందీలోకి డబ్ చేసి థియేటర్‌లలో రిలీజ్ చేయొద్దని నిర్మాతలను కోరినట్లు తెలుస్తోంది.

